క్లుప్తంగా

బోధనోపకరణాలతో మెరుగైన ఫలితాలు



నర్మెట: బోధనోపకరణాలతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ మడిపల్లి ఐలయ్య అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం మండల స్థాయి టీఎల్ఎంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీచింగ్ లర్నింగ్ మెటీరియల్స్‌తో విద్యార్థులకు సులభ విధానంలో బోధన చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలను మేళాలో ప్రదర్శించగా న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేశారు. కాగా, జిల్లా స్థాయిలో నిర్వహించే మేళాలో విజేతలు పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, స్థానిక ఎస్సై నగేష్, కాంప్లెక్స్ హెచ్ఎం నీలం వేణు, గోపాల్ రెడ్డి, కమల, పద్మ, టీచర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



జనగామ: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన చెరుకూరి శ్రీనివాస్ గుండె సంబంధిత శస్త్ర చికిత్స కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్‌గౌడ్ బుధవారం అందజేశారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక బాధిత కుటుంబం పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని మెరుగైన వైద్యం కోసం బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సహకారంతో ఎల్‌ఓసీ మంజూరు చేయించినట్లు చెప్పారు.

ఆర్థికసాయం



పాలకుర్తి టౌన్: కొండాపురం గ్రామానికి చెందిన భూక్య వంశీ ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్ కోర్సులో సీటు సాధించాడు. కాగా, ఆర్థిక ఇబ్బంది పడుతున్న వంశీకి అడ్మిషన్, హాస్టల్ ఫీజు కోసం దాతలు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన డాక్టర్లు సంజయ్, కోటేష్, చిదురాల మహేందర్, రాపాక సంతోష్, కమ్మగాని వెంకన్నగౌడ్ పదో తరగతి స్నేహితులు రూ. 22 వేల సాయం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



దాతలు ఇచ్చిన యూనిఫామ్‌లలో విద్యార్థులు

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని బీజేపీ మండల అధ్యక్షుడు బంగారు మహేష్ అన్నారు. బుధవారం నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన స్నేహితులు కన్నె అశోక్, కె.కిషన్‌లతో కలిసి విద్యార్థులకు రూ. 75 వేల విలువైన యూనిఫామ్స్, షూ అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల సమస్యలపై సమీక్ష

కొడకండ్ల: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, కల్యాణలక్ష్మి, ఎన్ఎఫ్‌బీఎస్, మీ సేవ సర్టిఫికెట్లపై సమీక్ష నిర్వహించి ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. తహసీల్దార్ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

అపర్ణకు డాక్టరేట్



జనగామ రూరల్: ఓబుల్ కేశ్వాపురం గ్రామానికి చెందిన బుర్ర శంకరయ్యగౌడ్–లక్ష్మి దంపతుల కుమార్తె అపర్ణ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్, వీసీ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను మంగళవారం అందుకున్నారు. డిగ్రీ వరకు జనగామలో చదివిన అపర్ణ ఉస్మానియా యూనివర్సిటీలో భౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. ప్రొఫెసర్ మహమ్మద్ కలీం అహ్మద్ జెలీలి సారథ్యంలో నానోఫెరైట్‌పై పరిశోధన గ్రంథం సమర్పించి డాక్టరేట్ పట్టా పొందారు. ప్రస్తుతం అపర్ణ హైదరాబాద్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా భౌతిక శాస్త్ర విభాగంలో పనిచేస్తున్నారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?

- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తానేదార్‌పల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



విశ్వనాథపురంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని విశ్వనాథపురం క్రాస్ రోడ్డు నుంచి జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(జీ) వరకు బీటీ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. విశ్వనాథపురం–తమ్మడపల్లి రోడ్డును డబుల్‌రోడ్డుగా చేయాలని ఏళ్ల తరబడి ప్రజల నుంచి డిమాండ్ ఉన్నా పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాలకుల పట్టింపులేని తనంతో ఈ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వనాథపురం క్రాస్‌రోడ్డు నుంచి తమ్మడపల్లి(జీ) గ్రామం వరకు దాదాపు 14 కిలోమీటర్ల దూరం ఉంటుంది. విశ్వనాథపురం నుంచి తానేదార్‌పల్లి, తీగారం, సూరారం మీదుగా తమ్మడపల్లి(జీ) వరకు రోడ్డు ఉంటుంది. అయితే దాదాపు 15ఏళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్డు కావడంతో ప్రస్తుతం పూర్తిగా దెబ్బతింది. గతంలో కురిసిన వర్షాలు, వరదలతో పాటు ఈరోడ్డు వెంట నిత్యం టిప్పర్‌లు, గ్రానైట్ లారీలు నడుస్తుండగా రోడ్డు ధ్వంసమైంది. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా రెండు పెద్ద వాహనాలు వస్తే ఇబ్బందికరంగా ఉంది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడగా ప్రస్తుత వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతుంది. గతంలో ఈ రోడ్డుపై పలు రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నప్పటికీ అధికారులు, పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

14 కిలోమీటర్లు..11 కల్వర్టులు

విశ్వనాథపురం క్రాస్ నుంచి తమ్మడపల్లి(జీ) వరకు 14 కిలోమీటర్ల దూరానికి 11 కల్వర్టులు ఉన్నాయి. గతంలో వేసిన బీటీ రోడ్డు దెబ్బతినడంతో పాటు కల్వర్టులు సైతం ధ్వంసమయ్యాయి. గతంలో కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలతో కల్వర్టులు దెబ్బతిని లోతుగా మారాయి. ప్రస్తుత వర్షాకాలంలో కల్వర్టులలో నీరు నిలుస్తుంది. దాంతో ద్విచక్రవాహనాలు, ఆటోలలో ప్రయాణించేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి విశ్వనాథపురం క్రాస్ నుంచి తమ్మడపల్లి జీ వరకు డబుల్‌రోడ్డు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటివరకూ మంజూరీ రాలేదు. దాంతో డబుల్‌రోడ్డు కోసం ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పనిచేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



విశ్వనాథపురం నుంచి తానేదార్‌పల్లి వరకు రోడ్డు గుంతలమయంగా, అధ్వానంగా మారినా అధికారులకు, పాలకులకు పట్టడం లేదు. గుంతల రోడ్డుపై సర్కస్ ఫీట్లతో వాహనదారులు అవస్థల పాలవుతున్నారు. డబుల్‌రోడ్డు విషయమై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎన్నికల ముందు చేసిన హామీని నెరవేర్చాలి.

– మాచర్ల గణేశ్, తానేదార్‌పల్లి

వర్షాకాలం వస్తే కష్టాలే



విశ్వనాథపురం గ్రామంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డుపై గుంతలతో కష్టాలు తప్పవు. విశ్వనాథపురం నుంచి తమ్మడపల్లి జీ వరకు డబుల్‌రోడ్డు వేస్తామని కాంగ్రెస్ నేతలు చేసిన హామీలను నిలబెట్టుకోవాలి.

–కంజర్ల యాదగిరి, విశ్వనాథపురం

స్మృతి వనం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

పాలకుర్తి టౌన్: తొలి తెలుగు విప్లవ కవి బసవ పురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి గుర్తుగా మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి సమీపంలో నిర్మించిన స్మృతివనంపై 'అధ్వానంగా సోమనాథుడి స్మృతి వనం' శీర్షిక బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా స్పందించారు. స్మృతి వనంను పరిశీలించి శుభ్రం చేయించి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వెంటనే జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూప స్మృతి వనంను సందర్శించి పరిశీలించారు. జీపీ సిబ్బందితో స్మృతి వనంలో పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. త్వరలోనే సోమనాథుడి స్మృతి వనాన్ని వినియోగంలోకి తీసుకువస్తామని డీపీఓ తెలిపారు.



స్మృతి వనాన్ని శుభ్రం చేయిస్తున్న డీపీఓ స్వరూప

ముగిసిన ఛాగల్ సబ్‌సెంటర్ గొడవ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్లులో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణ పంచాయితీ ఎట్టకేలకు ముగిసింది. గ్రామంలోని జాతీయ రహదారి పక్కన పల్లెప్రకృతివనం వద్ద హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ స్థలాన్ని చదును చేయిస్తుండగా కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు అడ్డుకోగా విషయం పోలీస్‌స్టేషన్‌కు చేరిన విషయం పాఠకులకు విదితమే. కాగా, గొడవ విషయమై విచారణ చేపట్టేందుకు బుధవారం రెవెన్యూ, పోలీసు, పీఆర్ అధికారులు ఛాగల్లుకు చేరుకుని సదరు స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ జి.వేణు తదితరులు గ్రామస్తులను విచారించగా గ్రామానికి హెల్త్ సబ్ సెంటర్ అవసరమేనని, అయితే పల్లెప్రకృతి వనం పక్కన వద్దని, పాత గ్రామ పంచాయతీ వద్ద నిర్మాణం చేయాలని మూకుమ్మడిగా తెలిపారు. కాగా కాంట్రాక్టర్ గణేష్ మాట్లాడుతూ గత కలెక్టర్, అధికారులు ఇక్కడే నిర్మాణం చేసేందుకు అప్రూవల్స్ ఇచ్చారని చెప్పారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ ప్రజల అభీష్టం మేరకు పనిచేస్తామని తెలిపారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి మరోచోట అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఊరూరా ఘనంగా బోనాలు



తరిగొప్పుల: బోనాలతో తరలి వెళ్తున్న గ్రామస్తులు



చిల్పూరు: గుడికి వెళ్తున్న మహిళలతో రమేశ్

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో శ్రావణమాసంలో నిర్వహించే పోచమ్మ బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామయాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మేకపోతుల బండ్ల ఊరేగింపు ఆకర్షణీయంగా నిలిచింది. బోనాల పండుగకు చివరిరోజు కావడంతో ఘనంగా నిర్వహించగా మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమా దంపతులు పోచమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మల్కాపూర్‌లో..

చిల్పూరు: మల్కాపూర్ గ్రామంలో ప్రజలు పోచమ్మ బోనాలు ఘనంగా చేశారు. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

తాత్కాలిక రోడ్డు ఏర్పాటు

శ్రీపతిపల్లి గ్రామంలో పోచమ్మగుడికి వెళ్లే రోడ్డు ఇటీవల వర్షాలకు ప్రమాదకరంగా మారింది. కాగా, బోనాల పండగను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రంగు రమేశ్‌గౌడ్ సొంత ఖర్చులతో మొరం పోయించి తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయించారు. దీంతో మహిళలు ఏ ఇబ్బం లేకుండా బోనాలతో గుడికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

బీరప్ప..

తరిగొప్పుల: సోలిపూర్‌లో బీరప్ప బోనాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తి ఊరేగింపు నిర్వహించారు. బోనాల ఊరేగింపు డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ శివసత్తుల పూనకాలు,యువకుల కేరింతలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కొనసాగుతున్న యూరియా తిప్పలు



ఘన్‌పూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలకు చెందిన రైతులు యూరియా బస్తాల కోసం పడుతున్న తిప్పలు కొనసాగుతున్నాయి. ఒకటి, రెండు బస్తాల కోసం గంటల తరబడి బారులు తీరి నిలబడాల్సి వస్తోంది. ముసురు వర్షంలోనూ రైతులు క్యూలలో నిల్చుని యూరియా బస్తాలను తీసుకెళ్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం) కార్యాలయానికి యూరియాబస్తాల కోసం రైతులు ఉదయమే పెద్ద సంఖ్యలో వస్తున్నారు. అయితే రైతుల పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా యూరియా బస్తాలు అందిస్తున్నారు. ఒక రైతుకు ఎకరం భూమి ఉంటే ఒక బస్తా, ఎకరం పైగా ఉంటే రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దాంతో నాలుగైదు ఎకరాలు ఉన్న రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అయితే ఇచ్చే అరకొర యూరియాకు సైతం ఓటీపీ, వేలిముద్ర అంటూ చాలా జాప్యం చేస్తున్నారని, సాంకేతిక సమస్యల సాకుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత నివారించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రఘునాథపల్లి: మండలంలోని రైతాంగానికి యూరియా కొరత నివారించాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేశారు. బుధవారం మండలకేంద్రంలోని ఎరువుల షాపుల వద్ద సీపీఎం నాయకులతో కలిసి యూరియా కొరతను నిరసిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు పొదల నాగరాజు, లవకుమార్, అంజనేయులు, ఐలయ్య, దెవేందర్, యాదగిరి రాములు ఉన్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

పాలకుర్తి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతులకు సరిపడా యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న అన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో యూరియా కోసం వేచి ఉన్న రైతులతో మాట్లాడారు. చెరుపల్లి కొమురయ్య, వి.నర్సిరెడ్డి, అంజిరావు, నర్సయ్య, బి.వెంకటయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: అన్నదాతలకు సరిపడా యూరియాను అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ అన్నారు. మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని, గోదాములను మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రావుల రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, రామగళ్ల అశోక్, సమ్మయ్య, కనుకాచారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ సేవలు మరువలేనివి



పాలకుర్తి టౌన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు



జనగామ రూరల్: జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



రఘునాథపల్లి: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: మాజీప్రధాని, దివంగత నేత రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్‌లు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు, సంస్కరణలు మరువలేనివని అన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాగా, మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జనగామ మండలంలోని చౌడారం కేజీబీవీ, పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్లు అందజేశారు.



నర్మెటలో..



కొడకండ్ల: నివాళులర్పిస్తున్న నాయకులు

గుంత తవ్వారు... వదిలేశారు

జనగామ పట్టణం జూబ్లీగార్డెన్స్‌కు వెళ్లే ప్రధాన రహదారి జంక్షన్ కూడలి మలుపు వద్ద గుంతను తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. వాహనదారులు, బాటసారులు, పిల్లలు జాగ్రత్తగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

–జనగామ



ప్రమాదకరంగా ఉన్న గుంత

జనగామ మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్వర్ రెడ్డి

జనగామ: జనగామ మున్సిపల్ కమిషనర్‌గా డి.మహేశ్వర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న మహేశ్వర్ రెడ్డికి జనగామకు అవకాశం ఇవ్వగా, ప్రస్తుతం పని చేస్తున్న వెంకటేశ్వర్లును రామగుండం అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది.

పీఆర్‌టీయూ మహాధర్నాను విజయవంతం చేయండి

లింగాలఘణపురం: పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని మండల ప్రధాన కార్యదర్శి వాంకుతోత్ బీకోజి కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

దేవరుప్పుల: ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కాంట్రిబ్యూటరీ విధానం రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ ప్రతినిధులు ఖాజా షరీఫ్, అంబటి అంజయ్య, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల విద్యావనరుల కేంద్రం వద్ద మహాధర్నా పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

నేడు వేదలో ఉచిత స్వర్ణప్రాశన

జనగామ: పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్‌లో నేడు (గురువారం) ఉచిత స్వర్ణ ప్రాశన పిల్లలకు వేయనున్నట్లు డాక్టర్ అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 నెలల నుంచి 16ఏళ్ల లోపు పిల్లకు స్వర్ణ ప్రాశన వేయడం జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 వరకు కార్యక్రమం కొనసాగుతుందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



బచ్చన్నపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొడవటూర్ గ్రామ మాజీ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామ యూత్‌కు రూ.17,400ల విలువైన క్రికెట్ కిట్టును ఆయన అందించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని అన్నారు.


వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

స్టేషన్‌ఘన్‌పూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ జి.వేణు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం సందర్భంగా నవరాత్రి ఉత్సవాల కోసం ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌లు చేసుకోవాలని, సంబంధిత మండపంలో కరెంటు సరఫరాకు అనుమతి తీసుకోవాలన్నారు. ఎస్సైలు వినయ్‌కుమార్, రమేష్, రాజేష్, మనీషా తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుకు నీరు సరఫరా చేయాలి

జనగామ రూరల్: జనగామ మండలంలోని అన్ని గ్రామాల్లో పంటల సాగుకు బొమ్మకూర్ రిజర్వాయర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని మర్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ రిజ్వాన్‌బాషాకు వినతి అందజేశారు.

వర్షాలకు కూలిన ఇల్లు



బచ్చన్నపేట: మండల కేంద్రంలో బందారి లక్ష్మి–చంద్రయ్య దంపతుల ఇల్లు వర్షాలకు మంగళవారం రాత్రి కూలింది. బాధిత కుటుంబ సభ్యులు ఇంటి ముందు రూములో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. లేచి చూసే సరికి ఇంటి వెనకాల రూం కూలిపోయింది. ఒక వేళ వెనుక రూములో నిద్రిస్తే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని అన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితులకు ఇందిరమ్మ ఇలు మంజూరు చేయాలని పలువురు కోరారు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు నల్లగోని బాలకిషన్‌గౌడ్ పరామర్శించి రెండోవిడత ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

వ్యసనాలకు బానిసకావొద్దు

చిల్పూరు: విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. కొండాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై హెచ్ఎం వినయ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఉపాధ్యాయులు మధుకర్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, సుధాకర్, వెంకటలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై నవీన్ కుమార్

సంక్షిప్త సమాచారం

స్థానిక సమస్యలపై సర్వే

జఫర్‌గఢ్: వడ్డెగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలపై పలు వార్డుల్లో బుధవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు కాట సుధాకర్ మాట్లాడుతూ వడ్డెగూడెంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసిందన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారంతో పూర్తిగా అపరిశుభ్రంగా తయారయిందన్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

గొడుగు వితరణ

జనగామ రూరల్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా పూర్వ గవర్నర్ లయన్ డాక్టర్ డి.లవకుమార్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం బస్టాండు సమీపంలోని పండ్ల వ్యాపారికి క్లబ్ బి బాయ్స్ ఆధ్వర్యంలో గొడుగు వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కన్నా శ్రీనివాస్, జోన్ చైర్మన్ బి.బాలభరద్వాజ్, సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన బోడపట్ల రవి (41) మంగళవారం క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన రవికి భార్య రమ, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశాక రవి మద్యానికి బానిసై పనికి వెళ్లడం మానేశాడు. దీంతో కుటుంబ పోషణ రమపై పడటంతో పిల్లలతో హైదరాబాద్‌కు వెళ్లి పనిచేస్తోంది. గ్రామంలోనే ఉన్న రవి మద్యానికి బానిసయ్యాడు. ఒంటరితనం భరించలేక జీవితంపై విరక్తి చెందిన రవి ఈనెల 17వ తేదీన మద్యం సీసాలో క్రిమిసంహారక మందు కలుపుకొని తాగాడు. పక్కింటి బుల్లె అరవింద్ చూసి 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ రవి మంగళవారం రాత్రి మృతి చెందాడు. భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యలకు నిలయంగా గ్రామాలు

జఫర్‌గఢ్: జీపీలకు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు లేక, పరిపాలన సక్రమంగా జరగక గ్రామాలు సమస్యలకు నిలయాలుగా మారాయని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ నజీర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏ గ్రామంలో చూసిన పారిశుద్ధ్యం, అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయన్నారు. ముస్లిం కాలనీ పూర్తిగా బురదమయంగా మారిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్



జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయులు విద్యార్థులతో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. అభ్యర్థుల ప్రచారం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటు వేసే విధానం, ఓట్ల లెక్కింపు, అభ్యర్థుల గెలుపు తదితర అంశాలపై విద్యార్థులకు మాక్ పోలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నర్మెట: మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిశుభ్రతను పాటించాలని తహసీల్దార్ మొహసిన్ ముజ్తాబా అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని బుధవారం తనిఖీ చేసిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వంటగది, సరుకుల నిల్వగదిని, నిత్యావసర సరుకులను, వండిన పదార్థాలను, రికార్డులను, హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. బాలికల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట ఏఎన్ఎం ఇస్లావత్ సౌమ్య, సిబ్బంది ఉన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

బచ్చన్నపేట: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మండల కార్యదర్శి దండుగుల మురళి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

దప్పులు, వంట పాత్రల బహూకరణ

రఘునాథపల్లి: కోమళ్ల గ్రామానికి చెందిన బొల్లపల్లి పరశురాము బుధవారం ఎస్సీ కులస్తులకు వంట పాత్ర, 10 దప్పులు బహూకరించి దాతృత్వం చాటారు. ఈ సందర్భంగా కుల పెద్దలు పరశురామును శాలువాతో అభినందించారు.